క్లుప్తంగా

పోషకాహారం కిట్ల పంపిణీ



పోషకాహార కిట్లు అందజేస్తున్న సర్పంచ్ పాపారావు

ఎస్.రాయవరం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు విధిగా పోషకాహారం తీసుకునేలా చూడాలని సర్పంచ్ పాలపర్తి పాపారావు అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో జగనన్న పోషకాహార కిట్లను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బాలం సూరిబాబు, వార్డు మెంబర్ గొంతిన సత్యనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత అచ్యుతాపురం జట్టు



గుర్రాజుపేటలో కబడ్డీ పోటీలను తిలకిస్తున్న గ్రామస్తులు

ఎస్.రాయవరం: శ్రీ కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా గుర్రాజుపేటలో గురువారం రాత్రి నిర్వహించిన కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక పెద్దలు రామరాజు, రాజరమేష్ తదితరులు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి 16 టీములు పాల్గొన్నాయి. అచ్యుతాపురానికి చెందిన అల్లూరి టీమ్ ప్రథమ బహుమతి సాధించగా, నక్కపల్లి మండలం మనబానివానిపాలెం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. గుడివాడ ఉన్నత పాఠశాల పీడీ రాజు అంపైర్‌గా వ్యవహరించారు. విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

పాడి పరిశ్రమతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న పశువైద్యాధికారి బాబూరావు పడాల్

కోటవురట్ల: గ్రామాల్లో రైతులు పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకొని ఆర్థిక పరిపుష్టి సాధించాలని కోటవురట్ల పశువైద్యాధికారి బాబూరావు పడాల్ తెలిపారు. కోటవురట్ల గ్రామంలో మహిళా రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అమూల్ డెయిరీ పాల సేకరణ ద్వారా రైతులకు మరింత లాభాలు వస్తాయని తెలిపారు. పశువులకు ప్రమాదబీమా వర్తిస్తుందని చెప్పారు. గ్రామాల్లో రైతులు బృందాలుగా ఏర్పడి పాలు పోయడం వల్ల మంచి లాభాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, వెలుగు సీసీ ఉమామహేశ్వరి, గొల్లు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



పోస్టరు ఆవిష్కరిస్తున్న మహిళలు

అచ్యుతాపురం(అనకాపల్లి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని నునపర్తి సర్పంచ్ చుక్కా అనురాధ అన్నారు.అచ్యుతాపురం మండలంలోని నునపర్తిలో శుక్రవారం బాల్య వివాహాలపై డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టరును ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం చినతల్లి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వరినాట్లు

రాంబిల్లి: మండలంలో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. శారదా నదిలో నీరు పెరగడంతో నాట్లు జోరందుకున్నాయి. ఎగువప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా శారదా నదిలో నీటి ప్రవాహం పెరిగింది. దిమిలి, కట్టుబోలు, మామిడివాడ తదితర గ్రామాల్లో దాదాపు చివరి దశకు వరినాట్లు చేరుకున్నాయి. వ్యవసాయ అధికారులు ఈ క్రాప్ నమోదు ప్రక్రియను నిర్వహించారు.

పెయ్యదూడల పథకం..

పాడి రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- పెయ్యదూడల ఉత్పత్తి పథకంతో పాడి రైతులకు మేలు
- సబ్సిడీతో లింగనిర్ధారిత వీర్యనాళికలు సరఫరా
- గ్రామాల్లో విస్తృత అవగాహన



కృత్రిమ లింగ నిర్ధారణ విదానంపై పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నక్కపల్లి: పాడిరైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వారిని ప్రోత్సహించేందుకు పలు పథకాలు అమలుచేస్తోంది. ఈ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. ప్రధానంగా పెయ్యదూడల ఉత్పత్తి పథకంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో మేలు జాతి లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం ద్వారా పెయ్యదూడలను ఎక్కువగా ఉత్పత్తి చేసి పాల దిగుబడి పెంపొందించే కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

పథకం లక్ష్యాలు...

◆ లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం ద్వారా రైతులకు కావాల్సిన మేలైన పెయ్యదూడలను 90 శాతం కచ్చితంగా పుట్టించి, తద్వారా పాలదిగుబడి, రైతులఆదాయం పెంపొందించడం.

◆ కనీసం 30 నుంచి 35 పశువులను గుర్తించి రైతులతో ఒప్పందం చేసుకుని లింగ నిర్ధారిత వీర్యంతో 25 ఆవుదూడలు ఉత్పత్తి చేయడం.

◆ ఇలా పుట్టిన దూడలు పెద్దవై చూలుకట్టి ఈనిన తర్వాత రోజుకు ఆయా గ్రామాల్లో కనీసం 200 నుంచి 250 లీటర్ల పాల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంటుంది.

లబ్ధిదారుల ఎంపిక

లింగ నిర్ధారిత వీర్యంపై ఆసక్తి కలిగిన ఔత్సాహిక పశు పోషకులు అందరూ ఈ పథకానికి అర్హులే. ఈ మధ్య ఈనిన (60నుంచి 90రోజుల్లోపు) 1నుంచి3 ఈతల మధ్య క్రమం తప్పకుండా ఎదకు వస్తున్న ఆరోగ్యవంతమైన, ఎటువంటి గర్భకోశవ్యాధులు లేని పశువుల్లో కట్టుశాతం ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి పశువులను కృత్తిమ గర్భధారణ పథకానికి ఎంపిక చేస్తారు. ముర్రా,జెర్సీ,హెచ్ఎఫ్,జెర్సీక్రాస్, హెచ్ఎఫ్‌క్రాస్, గిర్ సాహివాల్ తదితర జాతుల లింగనిర్ధారిత వీర్యనాళికలు అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు.

ఖర్చు, సబ్సిడీ..

ఈ పథకం ద్వారా ఒక్కొక్క కృత్రిమ గర్భధారణకు రూ.675 ఖర్చవుతుంది. నిర్ధారిత వీర్యనాళికలను రెండు పర్యాయాలు కృత్రిమగర్భధారణ చేసేందుకు సబ్సిడీపై అందిస్తారు.రెండువీర్యనాళికలధరరూ.1350, రైతులు చెల్లించాల్సిన మొత్తం ఒక్కొక్క పశువుకు రూ.500, ప్రభుత్వం రైతులకు ఇచ్చే సబ్సిడీ రూ.850.

అమలు విధానం

ఈ పథకంపై ఆసక్తి కలిగిన రైతులు సంబంధిత పశువైద్యాధికారులతో ఒప్పందం కుదుర్చుకుని తమ వాటాగా ఒక్కొక్క పశువుకు రూ.500 చెల్లించాలి.రెండు పర్యాయాల్లో కూడా పశువు గర్భం దాల్చకపోతే రైతులు చెల్లించిన మొత్తం తిరిగి వాపసు చేస్తారు. ఒకసారి మాత్రమే గర్భధారణ వీర్యకణాలు ఉపయోగించిన వారికి డబ్బు వాపసు చేయడం జరగదని అధికారులు తెలిపారు. రెండోసారి కృత్రిమ గర్భధారణ ద్వారా గర్భం దాల్చిన తర్వాత పశువుకు మగ దూడ పెట్టినట్టయితే రైతుకు తిరిగి వాపసు కింద రూ.250 చెల్లిస్తారు.

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పాడి పరిశ్రమను ప్రోత్సహించి,రైతుల ఆదాయం పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా సబ్సిడీపై కృత్రిమ లింగనిర్ధారిత వీర్యనాళికలను సరఫరా చేస్తున్నాం. దీనిపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వివరాలు కావాల్సిన వారు నక్కపల్లి పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో సంప్రదించాలి. ఈ సదుపాయాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ వీర్రాజు, పశుసంవర్ధక శాఖ ఏడీ, నక్కపల్లి

దార్లపూడిలో లేగదూడల ప్రదర్శన



ఉత్తమ పాడి రైతులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు



లేగ దూడలను ప్రదర్శిస్తున్న రైతులు

నక్కపల్లి/ఎస్‌రాయవరం: మండలంలోని దార్లపూడిలో శుక్రవారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. జిల్లాపశుగణాభివృద్ధి సంస్థ,నక్కపల్లి పశుసంవర్ధక శాఖ పరిధిలో చినగుమ్ములూరు డిస్పెన్సరీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా డీఎల్‌డీఏ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ రామమోహన్ రావు, నక్కపల్లి ఏడీ డాక్టర్ వీర్రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడిపరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. దీనిలో భాగంగా పశువుల్లో కృత్రిమగర్భ ధారణ, లింగ నిర్ధారణ వంటికార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

పాడిరైతులకు కృత్రిమ లింగ నిర్ధారిత వీర్యనాళికలను సబ్సిడీపై అందజేస్తున్నట్టు చెప్పారు. 1962 సర్వీసులు,వైఎస్సార్ పశుబీమా,టీఎంఆర్ దాణా ఉపయోగాలు, గడ్డికోత యంత్రాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా దార్లపూడిలో ఉన్న పలు లేగదూడలను రైతులు ప్రదర్శించారు. ఉత్తమ లేగదూడలు, పాడిపరిశ్రమలో ఎక్కువ ఆదాయం సంపాదిస్తున్న వారిని గుర్తించి వారికి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ వంశీకృష్ణ, గోపాలమిత్రలు చిన అప్పారావు,నూకరాజు,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

120 మందికి వైద్య పరీక్షలు



తిమ్మాపురంలో డ్రమ్ములో నీటిని పరిశీలిస్తున్న వైద్యాధికారి రాజేశ్వరి

ఎస్.రాయవరం: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి తెలిపారు.

తిమ్మాపురం సచివాలయం–2లో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 120 మందికి వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. డ్రమ్ములు, ఫ్రిజ్ తొట్టెలు, రుబ్బురోళ్లు, ప్లాస్టిక్ వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని, తొలగించి దోమల వ్యాప్తిని నిరోధించి, వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ,కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు.

ఈ పంట నమోదు తప్పనిసరి



పంటపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

అచ్యుతాపురం(అనకాపల్లి): రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించుకోవాలని అచ్యుతాపురం మండల వ్యవసాయ విస్తరణ అధికారి కె.బి. సత్యనారాయణ తెలిపారు. మండలంలోని ఖాజీపాలెం, జగ్గన్నపేట పరిసరాల్లోని వరినాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 400 హెక్టార్లలో వరి నాట్లు పూర్తి అయ్యాయని చెప్పారు. 70 హెక్టార్లలో గంటి పంట సాగవుతోందని తెలిపారు. ఈ పంట నమోదు చేసుకోకుంటే ప్రభుత్వం అందించే వ్యవసాయ అనుబంధ సంక్షేమ పథకాలు వర్తించవన్నారు.ఈ కార్యక్రమంలో ఖాజీపాలెం వీఆర్‌పీ కొండబాబు, రైతులు పాల్గొన్నారు.

నేడు ప్రశాంతి పాలిటెక్నిక్‌లో అప్రెంటిస్‌షిప్ డ్రైవ్

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఉదయం 10 గంటలకు అప్రెంటిస్‌షిప్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఆసియన్ పెయింట్స్‌కు కంపెనీలో అప్రెంటిషిప్‌కు గానూ డిప్లమో మెకానికల్, ఎలక్ట్రికల్, ఐటీఐ ఫిట్టర్,ఎలక్ట్రీషియన్ చేసిన వారు అర్హులని పేర్కొంది.

పోషకాహారంతోనే ఆరోగ్యం



తోటాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

మునగపాక(అనకాపల్లి): పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగ కృష్ణవేణి కోటేశ్వరరావు అన్నారు. పోషకాహార వారోత్సవాల సందర్భంగా మునగపాక మండలం తోటాడలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణవేణి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3.75 లక్షలతో మునగపాక ఆస్పత్రిలో అభివృద్ధి పనులు



మునగపాక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

మునగపాక(అనకాపల్లి): మునగపాక ఆస్పత్రిలో రూ.3,75,000 వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టాలని అభివృద్ధి కమిటీ సమావేశంలో ప్రతిపాదించారు. ఎంపీపీ జయలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. జెడ్పీటీసీ పెంటకోట సోము సత్యనారాయణ,సర్పంచ్ దిమ్మల అప్పారావు,డాక్టర్ విమల గిరి,దుర్గా ప్రవల్లిక,రాణి తదితరులు పాల్గొన్నారు. చూచుకొండ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం కూడా జరిగింది.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు



మల్లవరం శ్రీకృష్ణుని దర్శించుకుంటున్న సుకుమార వర్మ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని మల్లవరంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని విగ్రహాన్ని డీసీసీబీ మాజీ ఛైర్మన్ సుకుమార వర్మ శుక్రవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మల్లవరంలో స్థానిక యువత కృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పిన్నమరాజు వాసు, దేశంశెట్టి శంకర్‌రావు,కోన బుజ్జి పాల్గొన్నారు.

డ్రైనేజీల నిర్మాణానికి రూ.25.15 లక్షల మంజూరు



నిధుల మంజూరుకు సంబంధించి ఉత్తర్వులను అందజేస్తున్న ఎంపీ సత్యవతి

మునగపాక(అనకాపల్లి):మునగపాక మండలంలోని గణపర్తిలో డ్రైనేజీల నిర్మాణానికి రూ.25.15 లక్షలు మంజూరు చేసినట్టు ఎంపీ సత్యవతి తెలిపారు. గ్రాంట్ మంజూరు కాపీలను గణపర్తి సర్పంచ్ చదరం నాయుడుకి శుక్రవారం ఎంపీ సత్యవతి అందజేశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం ఉంటుందని, పార్లమెంటు నిధులతో అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

హెచ్ఐవీ వ్యాధి గ్రస్తులకు సహకరించాలి



మాట్లాడుతున్న డీఆర్‌పీ గోవిందరావు

పాయకరావుపేట: గ్రామాల్లో హెచ్ఐవీ వ్యాధి గ్రస్తులపై వివక్ష చూపకుండా సహాయసహకారాలు అందించాలని లింక్ వర్కర్స్ స్కీమ్ డీఆర్‌పీ ఎస్.గోవిందరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో మండలంలోని పెంటకోటలో గ్రామస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గోవిందరావు మాట్లాడుతూ ఎయిడ్ వ్యాధి గ్రస్తుల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల్లో వారికి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఐసీటీసీ, ఏఆర్‌టీఏ సీటీఐ సెంటర్స్ సర్వీసెస్ గురించి వివరించారు. స్థానిక నాయకుడు చేపల దేముడు మాట్లాడుతూ లింక్ వర్కర్స్ స్కీమ్ ద్వారా గ్రామంలో ప్రతి ఒక్కరూ రక్త పరీక్షలు చేసుకోవాలన్నారు. లింక్ వర్కర్స్ సూపర్‌వైజర్ డి.రమణ, లింక్ వర్కర్ జీసీహెచ్ నరసింగరావు పాల్గొన్నారు.

పాలింగ్ స్టేషన్ల పరిశీలన



వాద్రాపల్లిలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఆర్‌వో జ్ఞానవేణి

మునగపాక(అనకాపల్లి): మునగపాక మండలంలోని వాద్రాపల్లిలో గల పోలింగ్ స్టేషన్లను యలమంచిలి నియోజక వర్గ ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారిణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి శుక్రవారం పరిశీలించారు.అనంతరం గొల్లలపాలెంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైన భవనాన్ని పరిశీలించారు. వాద్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న నేతలు

మునగపాక(అనకాపల్లి): మునగపాక మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో మండలంలోని నాగవరం శివారు పాలిపిని వారి కల్లాల వద్ద నిర్మించిన సామాజిక భవనాన్ని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాలిపిని శ్రీనివాసరావు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు మరిసా రమణ,మండల సచివాలయాల కన్వీనర్ పొలిమేర పూర్ణ చంద్ర గణేష్,మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం



పారిశుధ్య కార్మికులకు నూతన యూనిఫాం అందిస్తున్న జానకీరామరాజు

అనకాపల్లిటౌన్: పట్టణ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం పారిశుధ్య కార్మికులకు ఉచితంగా యూనిఫారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా విధులు నిర్వర్తించి, ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు సీఎం కృషి



మాట్లాడుతున్న వాద్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక(అనకాపల్లి): మహిళల ఆర్థిక స్వావలంబనకు సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారని వాద్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. వాద్రాపల్లిలో శుక్రవారం నిర్వహించిన స్వయం సహాయక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సున్నా వడ్డీ,వైఎస్సార్ ఆసరా,అమ్మ ఒడి,వైఎస్సార్ చేయూత తదితర పథకాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం కొండమ్మ,సీసీ దేవానంద్,వీవోఏ ఆశ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిటెక్నిక్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఐవీఎస్ శ్రీనివాసరావు

కశింకోట: స్థానిక ఆర్‌ఈసీఎస్‌లో రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి శుక్రవారం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 61 మంది విద్యార్థులు కళాశాలలో చేరారు. స్థానిక కళాశాలలో ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, సివిల్ బ్రాంచ్‌ల్లో విద్యుత్ వినియోగదారులు, ఉద్యోగుల పిల్లల కోటా కింద 50 శాతం సీట్ల భర్తీకి పాలిసెట్ ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నియమించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఐవీఎస్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి, సీట్లు కేటాయించారు. ఇంకా 59 సీట్లు భర్తీ కాకుండా ఖాళీగా మిగిలాయి. ఈసీఈలో మాత్రమే సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యాయి. మిగిలిన మూడు బ్రాంచ్‌ల్లో సీట్లు ఖాళీ ఉన్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. కౌన్సెలింగ్ ప్రక్రియలో ప్రిన్సిపాల్ కె.శివ, కళాశాల జనరల్ హెడ్ ఎస్.గణేష్, సూపరింటెండెంట్ కె.శివరాం, బి.జగన్మోహిని తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై గడ్డి కోసే యంత్రం



రైతుకు అందజేసిన గడ్డి కోసే యంత్రం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని మల్లవరం శివారు నరేంద్రపురానికి చెందిన రైతుకు సబ్సిడీపై గడ్డి కోసే యంత్రాన్ని అందజేశారు.సర్పంచ్ పిన్నమరాజు వాసు చేతుల మీదుగా శుక్రవారం యంత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రావి శోభన్ బాబు,చందక బాబ్జి,రమణ,వెంకటి, ఫణీంద్ర,రాము పాల్గొన్నారు.

పెద్దల సమక్షంలో కులాంతర వివాహం



చీడికాడ శివాలయంలో పెళ్లి అనంతరం పెద్దలతో ప్రేమ జంట

చీడికాడ: పెద్దలు, కుల సంఘం నేతల ఆధ్వర్యంలో ప్రేమ పెళ్లి జరిగింది. చీడికాడకు చెందిన వేచలపు మణికంఠ, మునగపాక మండలం ఉమ్మలాడకు చెందిన కె.సర్వలక్ష్మి రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. కులాల వేరు కావడంతో ఇరు కుటుంబాల వారు వీరి పెళ్లికి అంగీకరించలేదు. దీంతో మణికంఠ తన ప్రియురాలి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆమె కుటుంబ సభ్యులు దళిత బహుజన సేన అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఎల్.శ్రీను, ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యులు గంగాధర్, మరియమ్మలను కలిసి సమస్య చెప్పారు. వారు పోలీసులను ఆశ్రయించగా ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చి పెళ్లికి ఒప్పించారు. ఈ మేరకు శుక్రవారం చీడికాడ శివాలయంలో ప్రేమ జంటకు పెళ్లి చేసి ఒక్కటి చేశారు. కార్యక్రమంలో చీడికాడకు చెందిన పలువురు దళిత సంఘ నేతలతోపాటు ఉత్తరాంధ్ర బీఎంఎస్ సెక్రటరీ గంగాధర్ ముదిరాజు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మకు శ్రావణ పూజలు



కనకదుర్గమ్మ సన్నిధిలో దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: శ్రావణమాసం ఉత్సవాల్లో భాగంగా మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ కల్యాణగిరిపై వేంచేసిన శ్రీ కనకదుర్గ అమ్మవారిని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ శుక్రవారం దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి ధర్మాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మేడిశెట్టి సత్తిబాబు, ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథ్, కార్యదర్శి బోయిన రమణాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు శిలపరశెట్టి బాబి, బోడపాటి చిన్న రాజారావు, దొడ్డి రమణ, రమణబాబు, రేబాక ఇంద్రకుమార్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.